ప్రజాశక్తి

ఆదివారం 09 ఫిబ్రవరి 2025 | 5 | కర్నూలు



జిల్లాకు అన్యాయమే..!

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం పార్లమెంట్‌లో 2025-26 ఆర్థిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. మొత్తం రూ.50,65,345 కోట్లతో ఈ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. బడ్జెట్‌లో జిల్లాకు నిధులు కేటాయించలేదు. మరో సారి మొండి చేయి చూపారు. కొత్త రైళ్లు, కొత్త రైల్వే లైన్లకు ఒక్క పైసా కూడా కేటాయించ లేదు. కర్నూలు సిటీ రైల్వే స్టేషన్ నుంచి విజయవాడ మీదుగా మచిలీపట్నం వరకూ గతంలో రైలు ఉండగా దాన్ని రద్దు చేశారు. దాన్ని తిరిగి నడపాలన్న డిమాండ్ ప్రజల నుంచి వ్యక్తం అవుతోంది. కాచిగూడ నుంచి గుంటూరుకు నడిచే ఎక్స్‌ప్రెస్ రైలును విజయవాడ వరకూ పొడిగించాలన్న ప్రజల ఆకాంక్ష నెరవేరలేదు. కర్నూలు నుంచి నంద్యాలకు వెళ్లాలంటే డోన్ మీదుగా వెళ్లాల్సి వస్తుండటంతో సమయం ఎక్కువ పడుతోంది. కర్నూలు నుంచి ఓర్వకల్లు, పాణ్యం మీదుగా నంద్యాలకు కొత్తగా రైల్వే లైన్ వేస్తే ప్రయాణ సమయం తగ్గిపోనుంది. జిల్లాలోని పుణ్యక్షేత్రాలను కలిపేలా మంత్రాలయం కర్నూలు - శ్రీశైలం కొత్త రైల్వే లైన్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఎన్నో ఏళ్లుగా ఉంది. బడ్జెట్‌లో వీటి ప్రస్తావన ఏ మాత్రం లేకుండా పోయింది. కర్నూలు సమీపంలో ఏర్పాటు చేయనున్న రైల్వే కోచ్ తయారీ ఫ్యాక్టరీకి కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు శూన్యమే. అవసరమైన స్థాయిలో నిధులు కేటాయించకపోవడంతో ఈ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ పనులు ముందుకు సాగడం లేదు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటుకు అప్పగించేలా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉందని ఆర్థిక విశ్లేషకులు భావిస్తున్నారు.

అందని కందిపప్పు : కర్నూలు జిల్లాలో 1,228 రేషన్ షాపులు ఉండగా వాటి పరిధిలో 6,76,209 రేషన్ కార్డులు ఉన్నాయి. నంద్యాల జిల్లాలో 5,41,804 రేషన్‌కార్డులు ఉన్నాయి. వాటికి నెలనెలా బియ్యం, కందిపప్పు, పంచదార పంపిణీ జరుగుతుంది. కందిపప్పును మాత్రం రెండు నెలలుగా ఇవ్వడం లేదు. ఒక్కో కార్డుకు కిలో కందిపప్పు ఇవ్వాల్సి ఉంది. ఈ లెక్కన నెలకు కర్నూలు జిల్లాకు 676.209 మెట్రిక్ టన్నులు, నంద్యాల జిల్లాకు 541.804 మెట్రిక్ టన్నులు అవసరం ఉంది. జిల్లాలో కొన్ని నెలలుగా కందిపప్పు సరఫరా పూర్తిస్థాయిలో జరగడం లేదు. ఆరు రెండు నెలలుగా అందరికీ కందిపప్పు అందడం లేదు. ఈ నెల 30 శాతం కార్డులకు మాత్రమే కందిపప్పు పంపిణీ చేశారు. దీంతో పేదలు పప్పులకు కూడా దూరమయ్యారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులకు సరఫరా చేయాల్సిన సరుకులను ప్రభుత్వం క్రమంగా తగ్గిస్తూ వస్తుంది. గతంలో టిడిపి ప్రభుత్వం క్రిస్మస్, సంక్రాంతి కానుక, రంజాన్ తోఫా అంటూ అవసరమైన సరుకులను రేషన్ షాపుల ద్వారా ఇచ్చేవారు. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత బియ్యం మాత్రమే పూర్తిస్థాయిలో ఇచ్చారు. ప్రతి నెలా కందిపప్పు అరకొరగానే పంపిణీ చేశారు. రంజాన్ తోఫాకు ఫుల్‌స్టాప్ పెట్టారు. ఈ ఏడాది జూన్‌లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పౌరసరఫరాల శాఖపై నిర్వహించిన సమీక్ష సందర్భంగా అన్ని సరుకులను పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు. కాని ప్రస్తుత పరిస్థితి భిన్నంగా ఉంది. కనీసం కందిపప్పు కూడా సరఫరా చేయకపోవడంతో లబ్ధిదారుల్లో నిరాశే మిగిలింది. దీపావళికి, దసరాకు, సంక్రాంతికి కూడా కందిపప్పు అందకపోవడంతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

యూరియా కొరత : జిల్లాలో రైతులను యూరియా కొరత తీవ్రంగా పట్టిపీడిస్తోంది. ఎంతో ఆశగా పంటలు సాగు చేసుకున్న రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. పలు గ్రామాల ఆర్‌ఎస్‌కె సెంటర్‌లలో యూరియా లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల కళ్లు గప్పి కొందరు డీలర్లు యూరియాను పక్కదారి పట్టిస్తున్నారు. ఎంఆర్‌పి కన్నా అదనంగా బస్తాపై రూ. 100 నుంచి 120 రూపాయల వరకు వసూలు చేస్తున్నారు.

అవి..ఇవి..అన్నీ..

కార్మికులను కట్టు బానిసలు చేసే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని జిల్లా వ్యాప్తంగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నాలు చేపట్టారు. పిల్లల పండగ 4వ కర్నూలు బాలోత్సవం రెండు రోజుల పాటు కన్నులపండువగా సాగింది. మొత్తం 57 పాఠశాలల నుంచి 3వేల మందికి పైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



సాయిబాబా గొప్ప అధ్యయన శీలి

- రాజకీయాలు సాహిత్యం వేర్వేరు కావు
- ప్రొఫెసర్ సాయిబాబా సహచరి వసంతకుమారి
- కర్నూలులో రెండ్రోజుల 'విరసం 24వ సాహిత్య పాఠశాల' ప్రారంభం



అమరవీరుల స్థూపం వద్ద నివాళ్లులర్పిస్తున్న వసంత కుమారి, అరసవిల్లి కృష్ణ తదితరులు

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్

ప్రొఫెసర్ సాయిబాబా గొప్ప అధ్యయన శీల అని, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా కవిత్వం రాశారని, ఆ సమూహాల్ని ఏకం చేయడంలో సఫలీకృతుడయ్యాడని ప్రొఫెసర్ సాయిబాబా సహచరి వసంత కుమారి పేర్కొన్నారు. కర్నూల్ నగరంలోని వెంకటేశ్వర కళ్యాణ మండపంలో 'సంక్షోభకాలంలో సాహిత్యకారుల పాత్ర విరసం 24వ సాహిత్య పాఠశాల' రెండు రోజుల కార్యక్రమం శనివారం ఉదయం ప్రారంభమైంది. ప్రారంభానికి ముందు అమరవీరుల స్థూపం ముందు విరసం కార్యకర్తలు జోహార్లర్పించారు. ప్రారంభ సభకు విరసం రాష్ట్ర అధ్యక్షులు అరసవిల్లి కృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వసంత కుమారి మాట్లాడుతూ ప్రగతిశీల కవులకు మానవత్వం, సహానుభూతి ఉండాలన్నారు. విరసం రాష్ట్ర అధ్యక్షులు అరసవిల్లి కృష్ణ మాట్లాడుతూ రాజ్యం ప్రశ్నించే కలాలను, గళాలను నిర్బంధించే ప్రయత్నం చేస్తుందన్నారు. ప్రగతిశీల ఉద్యమ కార్యకర్తలు కవులు, ఆదివాసీలపై, జరుగుతున్న మారణకాండపై మాట్లాడాలని కోరారు. సంక్షోభాల్ని ఎదుర్కొనేందుకు చేయాల్సిన ప్రణాళికలను చర్చించాలన్నారు. రెండవ సెషన్‌లో శివరాత్రి సుధాకర్ అధ్యక్షత వహించారు. 'మేధోసజన రంగాలపై ఫాసిస్టుల దాడి– కార్పోరేట్ ప్రయోజనాలు' అంశంపై ప్రముఖ కవి అల్లం రాజయ్య మాట్లాడారు. ఫాసిస్ట్ రాజ్యానికి వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. మూడో సెషన్‌లో 'సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో రచయితల దృక్పథాలు–వైఖరులు' అంశంపై సభను ఉజ్వల్, సిఎస్ఆర్ ప్రసాద్‌లు నిర్వహించారు. సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని ఈ దేశంలో మరింత బలోపేతం చేసే లక్ష్యంతో ఈ ఏడాదిలో శత వార్షికోత్సవ జయంతి వేడుకల్ని జరుపుకోనుందని తెలిపారు. లౌకికత్వం మీద పరోక్షంగా దాడి చేయడం, శాస్త్రీయవిజ్ఞానం పెంచుకునే ప్రయత్నాలు చేస్తే అవన్నీ మన సాధువులు వేల ఏళ్ళ నాడే వాడే వారని తప్పుదోవ పట్టించడం వంటి వాటిని ప్రచారం చేస్తుందన్నారు. సంఘ్ పరివార్ 7 రకాల ఎత్తుగడల్ని అవలంభిస్తోందని అన్నారు. ప్రాచీన భారతదేశ చరిత్ర ఘనమైనదని చెప్పడం, హిందువులుగా గుర్తించిన వారందరినీ ఒక గొడుగుకింద తీసుకురావడం, దేశం ఎదుర్కొంటున్న అన్ని రకాల ఉపద్రవాలకు ముస్లీంలు, క్రిస్టయన్లు, కమ్యూనిస్టులు కారణమని చెప్పి ఈ ముగ్గుర్ని అంతం చేసి జాతిని పునర్నవీకరణ చేయడం, ముస్లీంలను, హిందుత్వ విమర్శకులను దేశద్రోహులుగా, పాకిస్తాన్ అనుకూలమైన వాళ్లగా ముద్రవేయడం, విద్యను కాషాయికరించే పాఠ్యపుస్తకాలను తీసుకరావడం, మతాల ఆధారంగా ఆందోళన కార్యక్రమాలను చేయడం, మతఘర్షణలను, అల్లర్లను రెచ్చగొట్టడం, సైనిక దళాలను సంస్థలను తయారు చేయడం వంటి వాటిని ముమ్మరం చేసిందన్నారు. ఇటువంటి సందర్భంలో మనం చేయాల్సి పని, రచయితల పాత్రను అనంతమూర్తి, పెరుమాళ్ మురుగన్, దేవనూరు మహాదేవ, ప్రకాష్‌రాజ్, భన్వర్ మేఘ్వంశి ఎప్పటికప్పుడు గుర్తు చేస్తున్నారన్నారు. మతోన్మాదులను రాజకీయంగా దూరం చేయడానికి అందరం కృషి చేయాలన్నారు. స్కైబాబా మాట్లాడుతూ భారతదేశంలో ముస్లింలపై జరుగుతున్న దారుణ మారణకాండలపై కవులు గళమెత్తాలన్నారు. విరసం కళాకారులు ఆద్యంతమూ ప్రజా కళామండలి, అరుణోదయ, విరసం కళా బృందాల సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. సభలో వీక్షణం సంపాదకులు ఎన్.వేణుగోపాల్, విరసం కార్యదర్శి రివేరా, నాయకులు, పాణి, అరుణ్, వరలక్ష్మి, శశికళ, నాగేశ్వరాచారి తదితరులు పాల్గొని ప్రసంగించారు. అమరవీరుల కుటుంబ సభ్యులు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన విరసం ప్రతినిధులు, కర్నూలు కవులు మారుతి పౌరోహితం, ఎస్‌డివి అజీజ్, తెలుగు వెంకటేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్



మాట్లాడుతున్న విరసం రాష్ట్ర అధ్యక్షులు అరసవిల్లి కృష్ణ

'కెవి సుబ్బారెడ్డి' గుర్తింపును రద్దు చేయాలి

- కళాశాల ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తున్న కెవి సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల గుర్తింపును రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప, పిఎస్ఎన్ జిల్లా కన్వీనర్ అమర్ డిమాండ్ చేశారు. శనివారం నగర శివారులోని కెవి సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఎస్ఎఫ్ఐ, పిఎస్ఎన్ నాయకులకు యాజమాన్యానికి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. విద్యార్థి సంఘం నాయకులపై యాజమాన్య ప్రతినిధులు దురుసుగా మాట్లాడారు. 'కళాశాల తరగతులను ఇలాగే నిర్వహిస్తాం. ఎవరికి ఫిర్యాదు చేసుకుంటారో వెళ్ళండి' అంటూ విద్యార్థి సంఘం నాయకులపై యాజమాన్య ప్రతినిధులు విరుచుకుపడ్డారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప, పిఎస్ఎన్ జిల్లా కన్వీనర్ అమర్, ఎస్ఎఫ్ఐ రాయలసీమ యూనివర్సిటీ కన్వీనర్ రామకృష్ణ మాట్లాడుతూ కేవీ సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సెలవు రోజులో కూడా తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారన్నారు. అటానమస్ ఉందని విద్యార్థుల నుండి లక్షల రూపాయలు వసూలు చేస్తూ సరైన మౌలిక వసతులు కల్పించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. జెఎన్‌టియు అధికారులకు లంచాలు ఇవ్వడం వల్ల ఎన్ని సార్లు కంప్లైంట్స్ చేసినా కళాశాలకు విచ్చేసి కనీసం పరిశీలన చేయడం లేదన్నారు. గతంలో న్యాక్ బృందం కళాశాలను తూతూ మంత్రంగా తనిఖీలు చేసి ఏ ప్లస్ ర్యాంక్ ఇవ్వడం వెనక కూడా అనేక అనుమానాలకు తావిస్తుందన్నారు. ఈ కళాశాలపై సిబిఐ, ఐటీ అధికారులు సోదాలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా నాసిరకం కళాశాలలో అడ్మిషన్ చేయించరాదని కోరారు. కార్యక్రమంలో పిఎస్ఎన్ జిల్లా కో కన్వీనర్ మనోహర్, జిల్లా నాయకులు శంకర్, జితేంద్ర, రజాక్ తదితరులు పాల్గొన్నారు.



కళాశాల ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

'హంద్రీనీవా' విస్తరణ పనులు చేపట్టాలి

- ఆయకట్టు స్థిరీకరణ పనుల పూర్తికి నిధులు కేటాయించాలి - ఎడమ కాలువను పొడిగించి పెండింగ్ పనులు పూర్తి చేయాలి - రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్

ప్రజాశక్తి - పత్తికొండ

హంద్రీనీవా ప్రధాన కాలువ విస్తరణ పనులు చేపట్టాలని, ఆయకట్టు స్థిరీకరణ పనుల పూర్తికి నిధులు కేటాయించాలని, ఎడమ కాలువను పొడిగించి పెండింగ్ పనులను పూర్తి చేసి సాగు, తాగునీటిని అందించాలని అఖిలపక్ష పార్టీల రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక శాంతి టాలెంట్ స్కూల్‌లో అఖిలపక్ష పార్టీల రౌండ్ టేబుల్ సమావేశం సిపిఐ మండల కార్యదర్శి డి.రాజా సాహెబ్ అధ్యక్షతన నిర్వహించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామ చంద్రయ్య, జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్యలు మాట్లాడుతూ 6 లక్షల 25 వేల ఎకరాలకు సాగునీరు, 30 లక్షల జనాభాకు తాగునీరు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్న హంద్రీనీవా ప్రాజెక్ట్ పాలకుల నిర్లక్ష్యం కారణంగా పూర్తిగా విఫలమైందని విమర్శించారు. హంద్రీనీవా ప్రధాన కాలువ కింద ఉన్న స్థిరీకరణ పనులకు రాష్ట్ర బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించి, యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. హంద్రీనీవా ప్రధాన కాలువకు సిమెంట్ లైనింగ్ పనులను రద్దు చేసి కాలువ వెడల్పు చేపట్టాలని కోరారు. రాజకీయాలకతీతంగా పత్తికొండ నియోజకవర్గ అభివద్ధి కోసం కలిసికట్టుగా కృషి చేద్దామన్నారు. అనంతరం సిపిఎం మండల కార్యదర్శి వెంకటేశ్వర రెడ్డి, టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ముత్యాల తిరుపాల్, వైసిపి మండల కన్వీనర్ కారం నాగరాజు, మాజీ సర్పంచి సోమశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నబి రసూల్, చేతివృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కారన్న, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తిమ్మయ్య, ఏఐటియుసి జిల్లా డిప్యూటీ కార్యదర్శి కృష్ణయ్య, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నాగేంద్రయ్య, నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు ఉమాపతి, బి. సురేంద్ర కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మహమ్మద్ హుస్సేన్, లోక్‌సత్తా పార్టీ నాయకులు జయరాంలు మాట్లాడారు. కార్యక్రమంలో అఖిలపక్ష పార్టీల నాయకులు రామాంజనేయులు, సుల్తాన్, పెద్ద వీరన్న, నెట్టికంటయ్య, రంగన్న, వెంకటరామిరెడ్డి, నాగిరెడ్డి, అల్తాఫ్, దస్తగిరి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

'నేడు ఎస్ఎఫ్ఐ నగర మహాసభ'

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు ఎస్ఎఫ్ఐ నగర మహాసభ ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ కర్నూలు నగర కార్యదర్శి సాయి ఉదయ్ చెప్పారు. శనివారం నగరంలోని కెకె భవన్‌లో ఎస్ఎఫ్ఐ కర్నూలు నగర కార్యదర్శి సాయి ఉదయ్, ఉపాధ్యక్షులు అబుబకర్, సహాయ కార్యదర్శులు ఆర్యన్, మల్లేష్, నగర కమిటీ సభ్యులు పృథ్వీ విలేకరులతో మాట్లాడారు. విద్యారంగ సమస్యలపై నిరంతరం ఎస్ఎఫ్ఐ పోరాడుతోందన్నారు. ఈ మహాసభలో గత సంవత్సర కాలంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యమాలు పోరాటాలు సమీక్షించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకుంటామన్నారు. కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థలు విద్యార్థులను ర్యాంకుల పేరుతో ఒత్తిడికి గురి చేస్తున్నారని, కార్పొరేట్ ప్రయివేట్ శక్తులకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించడం కోసం మహాసభ వేదిక అవుతుందని అన్నారు. విద్యారంగంలో ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలలో, కళాశాలలో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందన్నారు. ప్రభుత్వం ఎటువంటి భర్తీలు చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారన్నారు. అధ్యాపకులను భర్తీ చేయాలని మహాసభలో చర్చించి పోరాటాలు నిర్వహిస్తామన్నారు. అదే విధంగా ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. డిగ్రీ కళాశాలలో మేజర్, మైనర్ విధానాన్ని తీసుకొచ్చి విద్యార్థులను ఇబ్బందుల గురి చేస్తున్నారన్నారు. విద్యారంగంలో ఉన్న అనేక రకాల సమస్యలపై మహాసభలో చర్చించి భవిష్యత్తు పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు.

బోరుకు మోటారు ఏర్పాటు చేయాలి : సిపిఎం


ప్రజాశక్తి- కోడుమూరు రూరల్

పాలకుర్తి గ్రామ శ్మశాన వాటికలో బోరుకు మోటారు ఏర్పాటు చేయాలని సిపిఎం నాయకులు కోరారు. శనివారం సిపిఎం నాయకులు బోరును, ట్యాంకును పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. బోరు వేసి చాలా రోజులైందని, అక్కడే ట్యాంకు కూడా నిర్మించారని తెలిపారు. బోరుకు మోటారు వేసి ట్యాంకుకు నీటిని నింపితే ఉపయోగంగా ఉంటుందని చెప్పారు. వేసవిలో నీటి కొరత లేకుండా, ఇళ్లకు, వాముదొడ్లలో పశువులకు తాగునీరు అందుతుందని చెప్పారు. అధికారులు బోరు సమస్యపై చర్యలు తీసుకొని మోటారు బిగించాలని కోరారు. సిపిఎం మండల నాయకులు గఫూర్ మియా, జిపి.వీరన్న, ఎర్ర మద్దిలేటి పాల్గొన్నారు.

14న రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

- ఎంపిపి అనిత యాదవ్, వైసిపి నాయకులు శ్రీనివాస్ యాదవ్

ప్రజాశక్తి - మద్దికెర



శ్రీమధమాంబ దేవి రథోత్సవంలో భాగంగా ఈనెల 14న మద్దికెర హెచ్‌పి పెట్రోల్ బంక్ ఎదురుగా రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపిపి అనిత యాదవ్, వైసిపి నాయకులు శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శనివారం వారు మాట్లాడారు. ఎద్దులు, పశు సంపద అంతరించిపోకుండా, రైతులను ప్రోత్సహించేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బండలాగుడు పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.60,116, రెండో బహుమతి రూ.40,116, మూడో బహుమతి రూ.30,116, నాలుగో బహుమతి రూ.20 వేలు, ఐదో బహుమతి రూ.10,116, ఆరో బహుమతి రూ.5,016 అందిస్తామని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే అభ్యర్థులు 14న ఉదయం 8 గంటల్లోపు మద్దికెరకు చేరుకోవాలని సూచించారు. ఈ పోటీలకు హాజరైన వారికి మధ్యాహ్న భోజనం ఉంటుందని తెలిపారు. కృష్ణ యాదవ్, వడ్డే నాగయ్య, జిలాన్ బాష, కవి రెడ్డి గోపాల్, కవి రెడ్డి రామాంజనేయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్య సేవలను వినియోగించుకోండి

- ఎమ్మెల్యే శ్యామ్ కుమార్ - సిజేరియన్ కాన్పులు ప్రారంభం

ప్రజాశక్తి - పత్తికొండ

పత్తికొండ ప్రజలు ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కెఇ.శ్యామ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం పత్తికొండ ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సిజేరియన్ ఆపరేషన్ థియేటర్‌ను ప్రారంభించారు. ఆస్పత్రిలో మొట్టమొదటి సిజేరియన్ ఆపరేషన్ చేయించుకున్న మహిళకు మగ పిల్లవాడు జన్మించాడని, ఆ బాబుకు ఎమ్మెల్యే నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేలా వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని తెలిపారు. సిజేరియన్ ఆపరేషన్లు జరగక ఐదేళ్లు అవుతోందని, గత వైసిపి ప్రభుత్వంలో ప్రభుత్వ వైద్యశాలలకు నిధులు రాక ఆపరేషన్లు నిలిచిపోయాయని చెప్పారు. కూటమి ప్రభుత్వంలో సిజేరియన్ ఆపరేషన్లు జరిగేటట్లు ఏర్పాట్లు చేశామన్నారు. మౌలిక సదుపాయాలు, టెక్నికల్ సిబ్బంది ఎంతమంది ఉన్నారు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ వైద్యశాలను తనిఖీ చేసి మందుల సరఫరా గురించి ఆరా తీశారు. వైద్య సేవలపై అక్కడున్న రోగులతోనూ మాట్లాడారు. ప్రభుత్వాస్పత్రిలో సదుపాయాలు, వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ ఆస్పత్రికి రోజుకు 600 నుంచి 900 మంది రోగులు వస్తున్న నేపథ్యంలో అవసరమైతే మరింత మంది వైద్యులను నియమిస్తామన్నారు. వైద్య సేవలు, సదుపాయాలపై డాక్టర్ కల్పనను అడిగి తెలుసుకున్నారు.

కమ్యూనిటీ హెల్త్ సెంటర్ డెవలప్‌మెంట్ కమిటీ ఛైర్మన్‌గా ఎమ్మెల్యే

ఆస్పత్రి డెవలప్‌మెంట్ కమిటీ ఛైర్మన్‌గా ఎమ్మెల్యే కెఇ.శ్యామ్ కుమార్, డైరెక్టర్లుగా టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు సాంబశివారెడ్డి, అడ్వకేట్ సురేష్ కుమార్, తెలుగు యువత రాష్ట్ర నాయకులు బత్తిన లోకనాథ్ ప్రమాణ స్వీకారం చేశారు. బిజెపి నియోజకవర్గ కన్వీనర్ గోవర్ధన్ నాయుడు, కురవ సంఘం డైరెక్టర్ పర్ల శ్రీనివాసులు పాల్గొన్నారు.



ఆపరేషన్ థియేటర్‌ను ప్రారంభిస్తున్న నాయకులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్యామ్‌కుమార్

నీటి హక్కుల పరిరక్షణకు పోరాటానికి సిద్ధం

- టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు క్రైం

జిల్లా నీటి హక్కుల పరిరక్షణ కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధమని టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి తెలిపారు. శనివారం టిడిపి జిల్లా కార్యాలయంలో కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లుతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తుంగభద్ర నదిపై కర్ణాటక ప్రభుత్వం కౌతాళం మండలం కుంబాలనూరు, చిలకలపర్వి మధ్య 0.35 టిఎంసిలతో బ్రిడ్జి కమ్ బ్యారేజీ నిర్మాణానికి ప్రయత్నాలు చేస్తోందన్నారు. మంత్రాలయం, చిన్నమందాల మధ్య 0.31 టిఎంసిలతో మరో బ్రిడ్జి కమ్ బ్యారేజీ నిర్మాణానికి ప్రయత్నాలు చేస్తోందని తెలిపారు. ఈ బ్రిడ్జి కమ్ బ్యారేజీ వల్ల భూగర్భ జలాలు పెరుగుతాయని, చుక్క నీరు కూడా తీసుకోమని కర్ణాటక ఇంజినీర్లు చెబుతున్నారన్నారు. బ్యారేజీ నిర్మాణం తర్వాత కర్ణాటక లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా అక్రమంగా తుంగభద్ర జలాలు తరలించుకుపోయే ప్రమాదం ఉందన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో.. కర్నూలు జిల్లా మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గంలోని నదీతీర గ్రామాల రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని తెలిపారు. కెసి కాలువ నీటి వాటా 31.90 టిఎంసిలు నికర జలాలుంటే.. 10 టిఎంసిలు తుంగభద్ర డ్యాం నుంచి, 21.90 టిఎంసిలు నదీ ప్రవాహం వరద నుంచి తీసుకోవాలన్నారు. కర్ణాటక బ్రిడ్జి కమ్ బ్యారేజీ కడితే సాంప్రదాయ వరద దిగువకు రాదని తెలిపారు. కెసి ఆయకట్టు సాగు ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందన్నారు. తుంగభద్ర జలాల వినియోగంపై ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల జలవనరుల నిపుణులతో కమిటీ వేసి, నివేదిక ఆధారంగా, కేంద్ర జల సంఘం ఆమోదంతోనే ముందుకు వెళ్లాలని తెలిపారు. టిడిపి నాయకులు కె.నాగేంద్ర, వై.నాగేశ్వరరావు యాదవ్, పి.రవికుమార్, జె.తిరుపాల్ బాబు, ఎల్లప్ప, ఎస్.ముంతాజ్, కెవి.సుబ్బారెడ్డి, సత్రం రామకృష్ణుడు, అఖిల్, బేతం కృష్ణుడు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తిక్కారెడ్డి





మాట్లాడుతున్న సురేష్ కుమార్

పాఠశాలల కుదింపు తగదు : యుటిఎఫ్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

పాఠశాలలను కుదించడం తగదని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్ తెలిపారు. శనివారం కర్నూలులోని కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు రవికుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సురేష్ కుమార్ మాట్లాడారు. పాఠశాలల పునర్నిర్మాణంలో భాగంగా ఇప్పటివరకు అధికారు లు పాఠశాలలను కుదించడమే పనిగా.. మోడల్ పాఠశాలల పేరుతో చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. రెండు, మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాల ను కూడా మోడల్ స్కూళ్లలో విలీనం చేసే ప్రక్రియను వేగవంతం చేస్తున్నారన్నారు. మోడల్ స్కూళ్లు 60 మంది విద్యార్థులు, ఆపైన ఉన్న పాఠశాలల ను ఎంపిక చేసి ఆ పాఠశాలకు ఒక కిలోమీటరు పరిధిలో ఉన్న ఇతర ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5వ తరగతులను కలపాలని తెలిపారు. మిగిలిన పాఠశాలలను బేసిక్ ప్రైమరీ స్కూళ్లుగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రతి పాఠశాలలో 1 నుంచి 5వ తరగతులు నిర్వహించాలన్నారు. ఉన్నత పాఠశాలలో తెలుగు, ఇంగ్లీష్ మీడియంగా ఉండాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రాంతాల్లోని పాఠశాలలను అలాగే కొనసాగించాలని కోరారు. ప్రధాన కార్యదర్శి నవీన్ పాటి, సహాధ్యక్షులు హేమంత్ కుమార్, కార్యదర్శి యెహోషువా, గౌరవాధ్యక్షులు దావీదు, గాదిలింగ, తిమ్మన్న, కౌలన్న, వెంకటేష్, సురేష్ బాబు, లక్ష్మీదేవి, చంద్ర కళ పాల్గొన్నారు.

యాదవుల ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

జిల్లా యాదవుల ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని టిడిపి నగర అధ్యక్షులు నాగరాజు యాదవ్ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. కర్నూలు జిల్లా పరిషత్ హాలులో ఆదివారం ఉదయం 10.30 గంటలకు ఈ ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని యాదవులు తరలిరావాలని, యాదవుల అభివృద్ధి ప్రణాళికల్లో భాగస్వామ్యం కావాలని కోరారు.

బెళగల్ చెరువు మరమ్మతులకు సిద్ధం

- టిబిజి డిఇ సుబ్బారాయుడు

ప్రజాశక్తి - సిబెళగల్

సిబెళగల్ చెరువు మరమ్మతులకు సిద్ధంగా ఉన్నామని టిబిపి కోడుమూరు డివిజన్ డిఇ సుబ్బారాయుడు పేర్కొన్నారు. శనివారం టిబిపి ఎఇ సూర్య ప్రకాష్ ఆధ్వర్యంలో గ్రామ పెద్దల సమక్షంలో చెరువు పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తూములు పూర్తిగా తుప్పు పట్టాయని, కరకట్టకు అక్రమంగా 100కు పైగా కొట్టాలు వేసుకొన్నారని తెలిపారు. ప్రధాన బేరు దగ్గర ఆనకట్ట శిథిలావస్థకు చేరిందని, చెరువులో జమ్మూ, బేరడు చెట్లు నిండుకొన్నాయని చెప్పారు. 1,840 ఎకరాలున్న చెరువు చుట్టూ సుమారు 240 ఎకరాలు ఆక్రమణ జరిగిందని, చర్యలు చేపట్టి ఆధునీకరణ చేపట్టాలని గ్రామ పెద్దలు, గ్రామస్తులు అధికారులను కోరారు. ప్రభుత్వానికి నివేదికలు పంపి, మరమ్మతులు త్వరగా చేపడతామని అధికారులు తెలిపారు. పూడిక తీత చేపట్టి రైతులకు పొలాల్లో వేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజలు, పెద్దలు సహకరించాలని కోరారు.

'విద్యార్థులకు కంప్యూటర్ నైపుణ్యం అవసరం'

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

విద్యార్థులకు కంప్యూటర్ నైపుణ్యం చాలా అవసరమని అసెస్‌మెంట్ అధికారి సర్తాజ్ ఠాకూర్ తెలిపారు. శనివారం స్థానిక ఉలిందకొండ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో కంప్యూటర్ అధ్యాపకులు రెడ్డిపోగు మోజస్ ద్వారా శిక్షణ తీసుకున్న పదో తరగతి విద్యార్థులకు ఐటి అసెస్‌మెంట్ ఎగ్జామ్ నిర్వహించారు. ఈ ఎగ్జామ్‌కు ఉత్తర ప్రదేశ్ నుంచి వచ్చిన అసెస్‌మెంట్ అధికారి సర్తాజ్ ఠాకూర్ విద్యార్థులకు ఐటి పరీక్షలు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు లీలావతి మాట్లాడుతూ... కంప్యూటర్ ప్రావీణ్యం ఉంటే ఉద్యోగాలు బాగా సంపాదించుకోవచ్చని తమ పాఠశాలలో విద్యార్థులకు కంప్యూటర్‌లో స్కిల్స్ నేర్పిస్తున్నామన్నారు. ఈ ఎగ్జామ్‌లో పదో తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.

'అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలి'

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

నాలుగో తరగతి కాలనీలో జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని ప్రజా పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బలరాం, ఎఆర్‌కె.డేవిడ్ డిమాండ్ చేశారు. శనివారం కలెక్టరేట్ ఎదుట ప్రజా పరిరక్షణ సమితి, నాలుగో తరగతి ఇంటి స్థల బాధితులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నాలుగో తరగతి హౌసింగ్ సొసైటీలో పెద్ద ఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నాయన్నారు. గతంలో ఈ సొసైటీలో పనిచేసిన అధ్యక్షులు అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడ్డారన్నారు. సొసైటీలో అక్రమాలకు పాల్పడిన బాల నరసింహులు, అబ్రహాం, నాగరాజు, మద్దిలేటి, లోకేష్, జగదీష్ కుమార్‌పై క్రిమినల్ కేసులను పెట్టాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారంలో బాధ్యతరహితంగా వ్యవహరిస్తున్న డిసిఐ రామాంజనేయులును సస్పెండ్ చేయాలని కోరారు. ఈ ఆందోళనలను రాబోయే రోజుల్లో మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిరుపయోగం

- లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా

ప్రజాశక్తి - కోసిగి

కోసిగిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిరుపయోగంగా ఉంది. లక్షలాది రూపాయలు వృథా అయ్యాయని ప్రజలు విమర్శిస్తున్నారు. కోసిగిలో 2007వ సంవత్సరంలో ప్రారంభమైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రూ.26 లక్షల నిధులతో నిర్మించారు. 8 నుంచి 10 ఏళ్ల పాటు ఆస్పత్రిలో సేవలందించారు. తర్వాత ఏ కారణం చేతనో అధికారులు ఆస్పత్రిని ఇతర చోటుకు మార్చారు. నేటి వరకు దాదాపు 7 ఏళ్ల నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరింది. లక్షలాది రూపాయల ప్రజాధనంతో ఆస్పత్రి నిర్మాణం చేపట్టి, వదిలేశారని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఈ ఆస్పత్రిని ఇలా గాలికి వదిలేయడంతో చుట్టూ కంప చెట్లు పెరిగి, పందుల సంచారంతో, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. ఆస్పత్రిలో ఉన్న కిటికీలు, అద్దాలు పూర్తిగా పగిలి శిథిలావస్థకు చేరింది. గట్టిగా ఉన్న నిర్మాణాన్ని ఇలా గాలికి వదిలేయడంతో నాయకులపైనా, అధికారులపైనా గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సేవలను పునఃప్రారంభించి, ప్రజలకు ఉపయోగపడే విధంగా చూడాలని కోరుతున్నారు.


నిరుపయోగంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ఆకట్టుకున్న సిద్దేశ్వరుని లంక దహనం

ప్రజాశక్తి - హొళగుంద

హొళగుంద కొండ గుహల్లో వెలసిన శ్రీసిద్దేశ్వరుని జాతరలో భాగంగా శనివారం జరిగిన లంక దహనం ఆకట్టుకుంది. ఆలయ ధర్మకర్త రాజా పంపనగౌడ్ ఆధ్వర్యంలో బాణసంచా పేల్చి, లంక దహనం ప్రారంభించారు. ఈ ఏడాది బాణసంచాలు వివిధ రూపాల్లో ఉండడంతో ఎంతగానో ఆకట్టుకున్నాయని చుట్టుపక్కల ప్రజలు తెలిపారు. ఎమ్మెల్యే బి.విరూపాక్షి, టిడిపి ఇన్‌ఛార్జీ బి.వీరభద్ర గౌడ్ శ్రీసిద్దేశ్వరుని దర్శించుకుని లంక దహనంలో పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా ఆలూరు సిఐ వెంకట చలపతి ఆధ్వర్యంలో హొళగుంద ఎస్ఐ బాల నరసింహులు, హాలహర్వి ఎస్ఐ చంద్ర, 40 మంది పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.


హాజరయిన నాయకులు

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని పరమాన్ దొడ్డి గ్రామంలో వైసిపి కార్యకర్త బొజ్జయ్య కుటుంబానికి వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. శనివారం గ్రామానికి చేరుకొని బొజ్జయ్య కుటుంబ సభ్యులను పరామర్శించిన ఆయన ధైర్యంగా ఉండాలని, అండగా ఉంటామని హామీ ఇచ్చారు. సుగాలి బొజ్జయ్య అనారోగ్యంతో బాధపడుతూ ఈనెల 3న మృతి చెందారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు మృతుని భార్య సుగాలి పద్మ, ఇద్దరు కుమార్తెలను ఓదార్చారు. దొడ్డి, నాగలాపురం, సింగరాజనహళ్లి సర్పంచులు సత్యా రెడ్డి, హనుమంత రెడ్డి, మధుసూదన్ రెడ్డి, హనుమంతు నాయక్, పాండు నాయక్, వీరేష్ ఉన్నారు.


చిన్నారిని ఓదార్చుతున్న ప్రదీప్‌రెడ్డి

'స్కావెంజర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి'

ప్రజాశక్తి - ఆలూరు

స్కావెంజర్లకు రాజకీయ వేధింపులు లేకుండా ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణ స్వామి డిమాండ్ చేశారు. శనివారం ఆలూరు జ్యోతిబసు భవన్‌లో మండల కార్యదర్శి రంగమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా చిరు ఉద్యోగులపై దండయాత్ర చేస్తూ వేధింపులకు గురి చేయడం తగదన్నారు. స్కావెంజర్లకు ఉద్యోగభద్రత కల్పించి కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, పిఎఫ్, ఇఎస్ఐ వర్తింపజేయాలని కోరారు. ఈరమ్మ, సక్కుబాయ్, లక్ష్మి రూప పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నారాయణ స్వామి

బుర్రకుంటలో తాగునీటి ఎద్దడి

- తాగునీటి కోసం గ్రామస్తుల అవస్థలు
- గ్రామంలో తాగునీటి ఎద్దడి తీర్చండి : గ్రామస్తులు

ప్రజాశక్తి - దేవనకొండ

వేసవి ప్రారంభం కాకముందే గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ముంచుకొస్తోంది. బోర్లలో భూగర్భ జలాలు అడుగంటుతుండడంతో తాగునీటి అవస్థలు తప్పడం లేదు. గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి సరఫరా అయ్యే తాగునీటి పైపులైను మరమ్మతులకు నోచుకోవడం లేదు. ఆ నీరు రాక తీవ్ర అవస్థలు పడుతున్నామని మండలంలోని వెంకటాపురం పంచాయతీ మజరా గ్రామం బుర్రకుంట గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


తాగునీటి కోసం బిందెలతో పడిగాపులు కాస్తున్న గ్రామస్తులు

మండలంలోని బుర్రకుంట గ్రామంలో 2 వేల మంది ప్రజలు నివసిస్తున్నారు. రక్షిత మంచినీటి పథకం ద్వారా గ్రామస్తులు దాహార్తిని తీర్చుకునేవారు. వేసవి కాలం ప్రారంభం కాకముందే మంచినీటి పథకం భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో నీటి ఎద్దడి నెలకొంది. గత ఏడేళ్ల క్రితం గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి డోన్ పట్టణానికి వెళ్లే తాగునీటి పైపులైను ద్వారా గ్రామానికి లింకు పైపులైన్ వేశారు. రెండేళ్లుగా పైపులైన్ మరమ్మతులకు నోచుకోకపోవడంతో లీకేజీలు ఏర్పడి మంచినీరు సరఫరా కావడం లేదు. గతేడాది పంచాయతీ నిధులతో వాటర్ ట్యాంకు ఏర్పాటు చేసి గ్రామస్తుల దాహార్తిని తీర్చారు. గ్రామంలో నెలకొన్న మంచినీటి ఎద్దడి విషయమై సంబంధిత ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు విన్నవించినట్లు గ్రామస్తులు తెలిపారు. నిధులు మంజూరు చేయకపోవడంతో గ్రామస్తులకు మంచినీటి అవస్థలు తప్పడం లేదు. అడుగంటిన భూగర్భ జలాలతో రక్షిత మంచి నీటి పథకం అరకొరగా వస్తుండడంతో నీటి గుమ్మి వద్ద రాత్రి, పగలు గ్రామస్తులు నీటి కోసం పడిగాపులు కాస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించి, గ్రామస్తుల దాహార్తిని తీర్చాలని, గాజులదిన్నె ప్రాజెక్ట్ నుంచి వేసిన పైపులైనుకు మరమ్మతు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తాగునీటి కోసం పడిగాపులు

- తలారి లక్ష్మీదేవి



మంచినీటి పథక బోరు సరిగా రాకపోవడంతో దాహార్తిని తీర్చుకునేందుకు తాగునీటి గుమ్మి వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది. దాహార్తిని తీర్చుకోవాలంటే తాగునీటి కోసం గంటల తరబడి లైన్‌లో నిలబడాల్సి వస్తోంది. నీటి పథక భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. నీటి కోసం తిప్పలు తప్పడం లేదు.

పైపులైనుకు మరమ్మతులు చేపట్టాలి

- హనుమంతమ్మ



గాజులదిన్నె నీటి ప్రాజెక్టు నుంచి గ్రామానికి వేసిన పైపులైన్‌కు గత కొన్నేళ్ల నుంచి మరమ్మతు చర్యలు చేపట్టకపోవడంతో పైపులైన్ లీకేజీ ఏర్పడి గ్రామానికి తాగునీరు సరఫరా కావడం లేదు. గ్రామస్తులు వ్యవసాయ రైతుల బోర్ల దగ్గరకు వెళ్లి నీటిని తెచ్చుకునే పరిస్థితి నెలకొంది. సంబంధిత శాఖ అధికారులు తాగునీటి ఎద్దడి తీర్చాలి.

రూ.5 లక్షలతో ప్రతిపాదనలు పంపాం

- ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ మురళీమోహన్



గ్రామంలోని రక్షిత మంచినీటి పథక భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో తాగునీరు సక్రమంగా రావడం లేదు. నీటి సమస్యను పరిష్కరించేందుకు రూ.5 లక్షలతో సంబంధిత ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరయిన వెంటనే పనులు ప్రారంభించి నీటి ఎద్దడి తీరుస్తాం.

సకాలంలో రుణాలు చెల్లించి, సున్నా వడ్డీ పొందండి

- సొసైటీ అధికారులు

ప్రజాశక్తి - చిప్పగిరి



బెల్డోన సొసైటీ బ్యాంకులో రుణాలు పొందిన రైతులందరూ సకాలంలో బకాయిలను చెల్లించి 'సున్నా' వడ్డీ పొందాలని సొసైటీ ప్రత్యేకాధికారి రామరాజు, సిఇఒ హరికృష్ణ తెలిపారు. శనివారం చిప్పగిరి సొసైటీ కార్యాలయంలో వారు మాట్లాడారు. సొసైటీలో క్రాప్ లోన్లు, దీర్ఘకాలిక లోన్లు, రాజన్న చేయూత, రైతు నేస్తంలో రుణాలు పొందిన వారందరూ సకాలంలో చెల్లించి 'సున్నా' వడ్డీ పొందడమే కాక బ్యాంకు అభివృద్ధికి తోడ్పాటునందించాలని కోరారు.

రాఘవేంద్రుని నిజ బృందావన దర్శనం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్ర స్వామి మఠంలో రాఘవేంద్రుని నిజ బృందావన దర్శన భాగ్యం భక్తులకు కల్పించారు. శనివారం ఏకాదశి తిథి సందర్భంగా రాఘవేంద్రుని బృందావనాన్ని నిర్మాల్యం చేసి తులసి అర్చన, కాషాయ వస్త్రాలతో, తులసి మాలతో అందంగా అలంకరించారు. ఏకాదశి తిథి కావడం వల్ల స్వామి వారికి నైవేద్య సమర్పణ లేకపోవడంతో భక్తులకు కూడా భోజన సదుపాయం, పరిమళ ప్రసాద విక్రయం చేపట్టలేదు.

'వసతి' లేని బాలుర గృహం

- తాగునీరు, మురుగుదొడ్లు కరువు
- ప్రహరీ లేక విద్యార్థుల ఇబ్బందులు

ప్రజాశక్తి - నందవరం

నందవరంలో గల బాలుర వసతి గృహంలో వసతులు కరువయ్యాయి. సరైన సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. నీటి సదుపాయం, మురుగుదొడ్లు లేక విద్యార్థులు అవస్థలకు గురవుతున్నారు. ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు.


వసతి గృహం (ఫైల్)

నందవరంలోని బాలుర వసతి గృహంలో సుమారు 250 మంది విద్యార్థులు ఉన్నారు. గృహంలో సరైన సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. వసతి గృహంలో ఉన్న మురుగుదొడ్లు చెడిపోయి ఉన్నాయి. మురుగుదొడ్ల సదుపాయం లేకపోవడంతో విద్యార్థులు చుట్టుపక్కల గల ముళ్ల పొదల్లోకి వెళ్తున్నారు. వసతి గృహాలను తనిఖీ చేసే సమయం అధికారులకు లేనట్టుంది. వసతి గృహాల్లో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు అధికారులకు పట్టడం లేదు. ప్రజాప్రతినిధులకు ఎన్నికల సమయంలో మాత్రమే పేదలు, వారి పిల్లలు గుర్తుకొస్తారని పలువురు మండిపడుతున్నారు. గ్రామంలో గల సంక్షేమ హాస్టల్‌ను, పాఠశాలలను ప్రజాప్రతినిధులు తనిఖీ చేసిన దాఖలాలు లేవు.

ప్రహరీ లేక భయాందోళనలో విద్యార్థులు

వసతి గృహం నిర్మించి ఏళ్లు గడిచినా ప్రభుత్వాలు మాత్రం ప్రహరీ నిర్మించలేకపోతున్నాయి. ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులకు రక్షణ కరువైంది. వసతి గృహం చుట్టూ దట్టమైన ముళ్ల చెట్లు పెరిగి ఉండడం వల్ల రాత్రిపూట విద్యార్థులు బయటికి రావడానికి కూడా భయపడుతున్నారు. ముళ్ల చెట్లు ఉండడం వల్ల దోమలు, పురుగులు సంచరించి విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారు. ప్రహరీ లేకపోవడం వల్ల విషసర్పాలు ప్రవేశించే ప్రమాదం ఉంది. సెలవు దినాల్లో మందుబాబులు వసతి గృహం ఆవరణలో మద్యం సేవిస్తున్నారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ప్రహరీ లేకపోవడంతో బయట ఆడుకోవడానికి, చదువుకోవడానికి సౌకర్యంగా లేదని విద్యార్థులు వాపోతున్నారు.

నీటి వసతి లేక ఇబ్బందులు

నీటి వసతి లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వసతి గృహంలో గల నీటి సమస్యలపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. చిన్నపాటి పైపులైన్ అధికారులు ఏర్పాటు చేశారు. ఆ కుళాయి ద్వారా వచ్చే నీటితోనే 250 మంది విద్యార్థులు సర్దుకోవాల్సి వస్తోంది. పిల్లలకు తాగడానికి కూడా అదే నీరు కావడం బాధాకరం. ఈ నీరు తాగడం వల్ల విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారు. వసతి గృహానికి నీటిని సరఫరా చేసేందుకు ఏర్పాటు చేసిన పైపులైన్‌ను సరైన విధంగా అధికారులు ఏర్పాటు చేయకపోవడం వల్ల నీరు సరిగా రావడం లేదు.

వసతి గృహం అభివృద్ధికి రూ.24 లక్షలు

- క్రాంతి కుమార్, వార్డెన్



వసతి గృహ అభివృద్ధికి రూ.24 లక్షలను ప్రభుత్వం ప్రకటించింది. త్వరలోనే అభివృద్ధి పనులు మొదలు పెడతాం. ముఖ్యంగా మురుగుదొడ్లు, వసతి గృహానికి పెయింటింగ్స్, గ్రౌండ్ మరమ్మతులను చేపడతాం. గృహానికి ఉన్న ఎలక్ట్రికల్ సిస్టం మార్చబోతున్నాం. విండోస్ మరమ్మతులను చేపడతాం. నీటి సమస్యపై అధికారులకు తెలియజేసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

వెంకటేష్ మృతి తీరని లోటు

- టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయం మాజీ ఉప సర్పంచి వెంకటేష్ (పాల వెంకు) ఆకస్మిక మృతి కలిచివేసిందని, ఆయన మృతి తీరని లోటని మాజీ సర్పంచి, టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం వెంకటేష్ గుండె నొప్పితో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వెంకటేష్ స్వామి శనివారం రాఘవేంద్ర నగర్ కాలనీలో ఉన్న వెంకటేష్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత కాంగ్రెస్ పాలనలో తాను సర్పంచిగా, వెంకటేష్ ఉప సర్పంచిగా పని చేసి గ్రామాభివృద్ధికి కృషి చేశామని పేర్కొన్నారు. తమ నుంచి దూరమైన తర్వాత ఆర్థికంగా ఇబ్బందులు పడ్డారని, నిరాశ, నిస్పృహలో ఆర్థికంగా కోలుకోలేక మృతి చెందడం బాధాకరమని తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చుతూ అంత్యక్రియల నిమిత్తం రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. టిడిపి మీడియా కోఆర్డినేటర్ విజయరామిరెడ్డి, చిన్న సుంకప్ప, చిన్న భీమా, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి ఏబు ఉన్నారు.


నివాళులర్పిస్తున్న వెంకటేష్ స్వామి

కార్యకర్తలకు అండగా ఉంటాం

- టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

నియోజకవర్గంలోని టిడిపి కార్యకర్తలకు అండగా ఉంటామని టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు భరోసా ఇచ్చారు. మండలంలోని సంతేకుడ్లూరు గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు గోవిందప్పను శనివారం చేకూరి నర్సింగ్ హోమ్‌లో పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గోవిందప్ప ఇటీవల కిందపడగా కాలు విరిగిందన్నారు. ఆదోనిలోని చేకూరి నర్సింగ్ హోమ్‌లో చికిత్స పొందుతున్నారని తెలిపారు. ఆస్పత్రికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నామని చెప్పారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరామన్నారు. ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారని అన్నారు.


గోవిందప్పను పరామర్శిస్తున్న ఉమాపతి నాయుడు

చలపతి కుటుంబానికి అండగా ఉంటాం

- టిడిపి నాయకులు రఘునాథ్ రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని సుంకేశ్వరి గ్రామానికి చెందిన టిడిపి నాయకులు కురువ చలపతి కుటుంబానికి అండగా ఉంటామని టిడిపి ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి సోదరులు, మాధవరం మాజీ సర్పంచి ఎన్.రఘునాథ్ భరోసా ఇచ్చారు. శనివారం చలపతి తల్లి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆయన గ్రామానికి చేరుకొని ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. టిడిపి నాయకులు రామలింగప్ప, అయ్యప్ప, అప్పిలి బీరప్ప, మల్లయ్య, నర్సప్ప, బీరప్ప ఉన్నారు.


నివాళులర్పిస్తున్న నాయకులు

వాల్మీకుల ఎస్టీ బిల్లుకు ఇప్పుడే అనుకూలం

- రాష్ట్ర ఐక్య వాల్మీకి పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మన్న

ప్రజాశక్తి - మంత్రాలయం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాల్మీకులకు ప్రాధాన్యత కల్పిస్తున్న ఈ తరుణంలోనే వాల్మీకుల ఎస్టీ బిల్లు ఆమోదానికి అనుకూలమని ఐక్య వాల్మీకి పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షులు బి.లక్ష్మన్న తెలిపారు. శనివారం స్థానిక రాఘవేంద్ర నగర్ కాలనీలోని ఆయన స్వగృహంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయ భాస్కర్ రెడ్డి పాలనలో.. సుమారు 40 ఏళ్ల క్రితం ఐక్య వాల్మీకి పోరాట కమిటీ ఏర్పాటు చేసి, మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టి.రామారావు హయాం నుంచి వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించాలని పోరాటాలు చేస్తూనే ఉన్నామని తెలిపారు. ఈ పోరాటంలో చాలా మంది కమిటీ సభ్యులు మృతి చెందారని చెప్పారు. కమిటీ స్థాపించినప్పటి నుంచి ప్రతి ముఖ్యమంత్రి దృష్టికీ సమస్యను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేశామని తెలిపారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాటకు ప్రధాని నరేంద్ర మోడీ వద్ద అత్యంత ప్రాధాన్యత ఉందని, ఆయన మాట కేంద్రంలో చెల్లుబాటు అవుతుందని చెప్పారు. వాల్మీకుల సమస్యను ఉప ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేంద్ర బాబుతో కలిసి ప్రస్తావించినట్లు తెలిపారు. రాజకీయ పార్టీలు, గ్రూపులకు అతీతంగా వాల్మీకులందరూ కలిసి సభలు, సమావేశాలు నిర్వహించి, సింహ గర్జన వంటి కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఉపాధ్యక్షులు జగ్గాపురం చిన్న ఈరన్న, రాష్ట్ర నాయకులు లంకా రెడ్డి, నదీచాగి మారెన్న, సర్పంచి తిమ్మప్ప, సర్పంచి శివరాములు, మాజీ సర్పంచి జె.హనుమంతు, మాజీ సర్పంచి జయన్న, శేషాద్రి, తిమ్మప్ప, మునెప్ప, వీరా రెడ్డి, మహదేవ్, వెంకటేశులు, మణికంఠ, గోపాల్, బోడి స్వామి, శ్రీరాములు, నరసింహులు, ఉరుకుందు, హనుమేష్, వన్నూరి, శీను, శేఖర్, గోవిందు, చిన్న మహా దేవా పాల్గొన్నారు.


అభివాదం చేస్తున్న నాయకులు

10న మిర్చి రైతుల జిల్లా సదస్సు

- జయప్రదం చేయండి : రైతుసంఘం

ప్రజాశక్తి - ఆలూరు


ఈనెల 10న ఆదోనిలో జరిగే మిర్చి రైతుల జిల్లా సదస్సును జయప్రదం చేయాలని ఎపి రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి.హనుమంతు, మండల కార్యదర్శి యు.ఈరన్న శనివారం ఓ ప్రకటనలో కోరారు. గత రెండేళ్ల నుంచి మిరప పంటకు గిట్టుబాటు ధర లేక జిల్లాలో పెద్ద ఎత్తున రైతులు నష్టపోతున్నారని తెలిపారు. గతేడాది కంటే సాగు విస్తీర్ణం తగ్గినా పంట ధర మాత్రం పెరగడం లేదని, రోజురోజుకు మిర్చి ధర పతనమవుతోందని అన్నారు. నిల్వ చేసిన మిరప పంటను కొనే దిక్కు లేదని, మిర్చి రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ఉందనికేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తెలిపారు. ప్రభుత్వాలకు చీమకుట్టినట్లు కూడా లేదని, మిర్చి రైతుకు కనీసం మద్దతు ధరను ప్రకటించిన పాపాన పోలేదని విమర్శించారు. ఈఏడాది అకాల వర్షాల వల్ల దిగుబడి పూర్తిగా తగ్గిపోయిందని, ఎకరాకు ఐదు క్వింటాళ్లు కూడా వచ్చే పరిస్థితి లేదని తెలిపారు. మిరప రైతులు అప్పుల పాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, కొంతమంది రైతులు పంటను వదిలేసి వలస బాట పడుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మిరప రైతులను ఆదుకోవాలని కోరారు. ఈనెల 10న ఆదోనిలోని ఎస్‌కెడి కాలనీ ఎన్‌జిఒస్ హాలులో ఉదయం 11 గంటలకు సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథిగా రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి హాజరవుతున్నారని, నియోజకవర్గంలోని మిర్చి రైతులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

సేవలను విస్తృత పరచాలి

- మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మాచాని కుటుంబ సభ్యులు మాచాని నాగరాజు, ఉషా సామాజిక, సంక్షేమ సేవలను విస్తృత పరచాలని సామాజికవేత్త, మల్లెల గ్రూప్ అధినేత మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడారు. తన మిత్రుడు మాచాని కుటుంబానికి చెందిన వ్యక్తి మాచాని నాగరాజు, ఆయన భార్య ఉషా గత 30 ఏళ్లుగా హైదరాబాద్‌లో వర్తక, వాణిజ్య సంస్థలు నిర్వహిస్తూ జీవిస్తున్నారని తెలిపారు. వారికి నందవరం మండలం జగ్గాపురం గ్రామ పరిసర ప్రాంతాల్లో పొలాలు, ఆస్తులు ఉన్నాయని చెప్పారు. శుక్రవారం జగ్గాపురం గ్రామంలో వారికున్న పొలం దగ్గర శ్రీసీతారాముల గుడి కట్టించి, ప్రాణప్రతిష్ట చేశారని తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు అన్నదానం నిర్వహించారని అన్నారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గంలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరినట్లు తెలిపారు. వారు సానుకూలంగా స్పందిస్తూ ఇకపై ఎమ్మిగనూరు ప్రజలతో మమేకమై సేవలను అందిస్తామని తెలిపారని అన్నారు. భవానీ, మాచాని శివ కుమార్, యుకె.మోహన్, నటరాజు, చిన్న ఈరన్న, ఆర్‌కె.విష్ణు వర్ధన్ రెడ్డి, బాల, లచ్చన్న పాల్గొన్నారు.


మాచాని నాగరాజు, ఉషాతో ఉన్న ఆల్ఫ్రెడ్ రాజు

'హృదయ రాగాలు' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

కడపలోని శంకరాపురం ఐఎంఎ హాలులో 'హృదయ రాగాలు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. పెద్దకడబూరు మండలం కంబదహాళ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయులుగా పని చేస్తున్న ప్రముఖ బాలసాహిత్యవేత్త, బాలబంధు గద్వాల సోమన్న 63వ పుస్తకం 'హృదయ రాగాలు'. అవనిగడ్డ ఎమ్మెల్యే డాక్టర్ మండలి బుద్ధ ప్రసాద్, హైదరాబాద్ పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య వెలదండ నిత్యానంద రావు, ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి, జింక సుబ్రహ్మణ్యం, ప్రసిద్ధ తెలుగు సినీ నటుడు శివకృష్ణ, అతిరథ మహారథుల చేతుల మీదుగా శనివారం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని ఎల్లాప్రగడ నరసింహ సాయికి అంకితమిచ్చారు. అనంతరం గద్వాల సోమన్నను సన్మానించారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డికె.చదువుల బాబు, కవి, కళాకారుడు కెవి.నాగేశ్వరయ్య, కొప్పుల ప్రసాద్, జహీర్ పాల్గొన్నారు.


పుస్తకావిష్కరణలో గద్వాల సోమన్న


ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఆదోనిరూరల్

మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో వెలసిన శివ సాయి గణేష్ ఆలయం 22వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సురేష్ శాస్త్రి, జగదీష్ స్వామి ఆధ్వర్యంలో ఉదయం స్వామి వారి మూల విరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించి, విశేష పుష్పాలంకరణ చేసి పూజలు చేశారు. ఆలయ వార్షికోత్సవానికి రౌడుకుంది పీఠాధిపతి శివయోగిస్వామి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. మాల ధరించిన శివస్వాముల ఆధ్వర్యంలో ప్రత్యేక భజనలు చేపట్టారు. అనంతరం మధ్యాహ్నం అన్నదానం చేశారు.

ప్రశాంతంగా ఎంపిక పరీక్షలు


ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

బనవాసి జవహర్ నవోదయ 9, 11వ తరగతి ఎంపిక పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు ప్రిన్సిపల్ పద్మావతి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో నవోదయ 9వ తరగతికి శనివారం ఉదయం 11.15 నుంచి మధ్యాహ్నం 1.45 గంటల వరకు రెండు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. 1,176 మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా 836 మంది హాజరయ్యారని చెప్పారు. 11వ తరగతికి ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు 4 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. 1,199 మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా 871 మంది హాజరయ్యారని వివరించారు.

12 వరకు గడువు పొడిగింపు

- ఎంపిడిఒ అల్లా బకాష్

ప్రజాశక్తి - చిప్పగిరి



బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల కోసం ఈనెల 12 వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందని ఎంపిడిఒ అల్లా బకాష్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడారు. బీసీ, ఈబీసీ కులాల వారందరూ స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి ఉన్న నిరుద్యోగులు ఆన్‌లైన్ ద్వారా కానీ, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ ద్వారా కానీ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు చేసుకునేవారికి 21 నుంచి 60 ఏళ్ల వరకు ఉండాలని చెప్పారు. తెల్లరేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు కలిగి ఉండాలన్నారు. ఒక కుటుంబం తెల్ల రేషన్ కార్డులో ఒకరికి మాత్రమే లబ్ధి పొందేందుకు అర్హత ఉంటుందన్నారు.



శ్రీనివాస్‌ను కలిసిన కృష్ణమ నాయుడు

ప్రజాశక్తి - హాలహర్వి

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ యాదవ్‌ను టిడిపి జిల్లా అధికార ప్రతినిధి కృష్ణమ నాయుడు విజయవాడలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆలూరు అభివృద్ధికి, వేదవతి, నగరడోన రిజర్వాయర్లకు నిధులు ఇవ్వాలని కోరారు. అలాగే ఆలూరు సమస్యలపై వివరించారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి మహిళ మృతి

ప్రజాశక్తి - తుగ్గలి

మండలంలోని రాంపల్లి గ్రామంలో శనివారం కూలి పనికి వెళ్లిన చాకలి మధులక్ష్మి (42) ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. చాకలి మధులక్ష్మి నీటి కోసం బావి దగ్గరకు వెళ్లి నీళ్లు ముంచుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి బావిలోకి పడినట్లు చెప్పారు. విషయాన్ని పక్కనే ఉన్న వారి బంధువు గమనించి ఆమెను కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో ఆమె మరణించినట్లు గ్రామస్తులు తెలిపారు.